# భగ్న ప్రేమికులు

రచన: శ్రీ కవుల ఆంజనేయశర్మ,
శ్రీ జి. ఎస్. కె. సాయిబాబా.

(గత సంచిక తరువాయి)

అంతవరకు తల్లిదండ్రులకు నమస్కరించిన చేతులు క్రిందికి వాలిపోయాయి. ఉండలాంటి వస్తువు కన్పించలేదు. కనుక పాటలు నిలచి పోయాయి, శరీరం చల్లబడిపోయింది. నాగమణి ప్రాణాలు గాలిలో కలిసి ఆగిపోయింది. అరచి అరచి వున్నదేమో స్పృహ తప్పి పోయింది. భూమ్మీద వాలిపోయింది.

తల్లిదండ్రులు నాగమణి పోవటం చూచి ఆపలేని దుఃఖంతో 'అమ్మా మణీ!' అంటూ భయంకరంగా అరచి కుమార్తె శవంపై వాలిపోయారు.

అమ్మాయే ప్రాణమని జీవించారు. అమ్మాయిని చూసుకొనే మురిసి పోయారు. అమ్మాయే లేకపోతే జీవించలేమన్నారు. పంచప్రాణాలు అమ్మాయే అన్నారు. చివరకు ఆ అమ్మాయినే కోల్పోయారు.

ఆ కేకకు అంతవరకు గాఢ నిద్రలో మునిగివున్న డాక్టర్ రాజారావు గారు అదిరిపడి లేచారు. మంచం మీద నాగమణిపై తల్లిదండ్రులు అలా పడివున్నారేమిటి చెప్మా అనుకుంటూ, నాగమణి మొహం చూచి ఆమె చనిపోయిందని నిర్ధారణ చేసుకున్నారు.

'ప్రకాశరావుగారూ! దుఃఖిస్తే ఏం ప్రయోజనం చెప్పండి? ఆమె అదృష్టవంతురాలు. మీరు అలా విచారిస్తే ఆమె ఆత్మకు శాంతి వుండదు. లేవండి'— అంటూ ప్రకాశరావుగారి చెయ్యిపట్టుకొని లేవదీశారు. రత్నమ్మగారిని కూడా లేవదీసి ఓదార్చారు. అప్రయత్నంగా ఆయన కళ్ళల్లో నీరు నిలిచి వెంటనే కన్నీటి బిందువులు జలజలా క్రిందకు రాలి శవంపై పడ్డాయి. దుఃఖం రాసాగింది. కనుపాపల్లో నిలిచిన కన్నీటి బిందువులను కొనగోటితో తుడుచుకున్నారు డాక్టరు.

అప్పటికే తెల్లగా తెల్లారి పోయింది. పడమట ఇంద్రధనస్సు రంగులను వెదజల్లుతూ వెలసింది. తూర్పు దిశన బాలభానుడు ఎర్రగా ఉదయించాడు. భాస్కరుని కాంతి పుంజాలు లోకాన్నంతా ఆలుము కుంటున్నాయి. రైతులు పొలాలకు బయలు దేరారు. రాత్రి వర్షానికి రోడ్లన్నీ బురదతో చాలా అసహ్యంగా నిండివున్నాయి. చెట్ల ఆకులపై నిలచిన వర్షపు బిందువులు బాలభానుకిరణాలకు మిలమిల మెరుస్తున్నాయి. మకరందాస్వాదన కొరకు రకరకాల తుమ్మెదలెన్నో రంగులను వెదజల్లుతూ మొగ్గలు ఎప్పుడు వికశిస్తాయా, ఎప్పుడు తమ పని ప్రారంభిద్దామా అని ఎదురు చూస్తున్నాయి. రకరకాల పూవులెన్నో రేకులను విప్పుకొని వికసించాయి. సూర్యకాంత పుష్పం రవివైపు తన అందాల మోము త్రిప్పింది, ఆత్రుతగా మకరందాన్ని కడుపునిండా నింపుకుంటున్నాయి తుమ్మెదలు. ఆకాశంలో చిన్న చిన్న మేఘాలు పచార్లు చేస్తూ రాత్రి తాము జరిపిన దాడి ఫలితాలను తిలకిస్తున్నాయి. వర్షం పూర్తిగా వెలసి పోయింది. ప్రశాంత వాతావరణం ఏర్పడింది.

డాక్టరు రాజారావుగారి పిలుపువల్ల చుట్టుప్రక్కల వాళ్లు వచ్చారు. నాగమణి మరణానికెంతో విచారించారు. కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. ధర్మదాతలు, సుగుణ సంపన్నులు అయిన ప్రకాశరావుగారికి పుత్రికా వియోగం కల్గినందుకు ఎంతో చింతించారు. అక్కడకు వచ్చిన వారంతా కాస్తో కూస్తో వీరివల్ల సహాయం పొందినవారే తప్ప పొందనివారు లేరు. కన్నీటి ప్రవాహంతో స్మశానానికి ఆమె శవాన్ని చేర్చారు. అగ్నిదేవుడు నాల్కలు చాస్తూ, ఆ శవాన్ని కాల్చివేస్తున్నాడు. కాలుతున్న కట్టెనుండి పొగలు సన్నగా వెలువడి ఒక దానితో నొకటి పెనవేసుకొని, నింగికి ఎగసి పోతూవున్నాయి. డాక్టరు రాజారావుగారి చెంపలమీదుగా కన్నీరు కారుతూ నేలపై పడుతోంది. ప్రకాశరావు, రత్నమ్మగార్లు భోరున విలపిస్తున్నారు. స్మశానం! భయంకర స్మశానం! ఎంతమంది శవాలను తనలో నిరాదరణగా కలుపుకుందో; చిన్న, ధనవంతులు, పేదవారు...ఒకరేంటి? ఆఖరికి నడిరోడ్డుపై నక్కచావు చచ్చిన బిచ్చగాడైనా అక్కడికి చేరవలసిందే, బ్రతికున్నవాళ్లు ఎక్కువ తక్కువ తారతమ్యం, చనిపోయిన తరువాత అంతా అక్కడకు పోవల్సిందే. స్మశానమంతా సగం సగం కాలిన దుంగలతో, ఎముకలతో, పుర్రెలతో, కట్టెలతో, పాడలతో, కాలుతున్న కట్టెలతో, బొగ్గులతో, పిడకలతో భయంకరంగా నిండి వుంది. రాత్రి కురిసిన వర్షానికి మరింత అసహ్యంగా తయారయింది.

శవాన్ని అగ్నిదేవుడు తనలో కలుపుకొని మూడు పిడికెల బూడిద మాత్రం మిగిల్చాడు. ఆ బూడిదను తీసుకొని డాక్టరు రాజారావుగారు, ప్రకాశరావు, రత్నమ్మగార్లు బరువుగా, బాధగా, వేదనతో నిండిన హృదయంతో ఇల్లు చేరారు.

కళావిహీనమయింది ఆ యిల్లు, ఒంటరి జీవితాన్ని గడుపలేక క్రమంగా రత్నమ్మగారు మనోవ్యథతో చిక్కి శల్యమై మంచం పట్టారు. కొన్నాళ్లు తీసుకొని కాలధర్మం చేశారు ఆవిడ. ప్రకాశరావుగారి జీవితం మరింత అంధకారమయింది.

*  *  *  *

కాకినాడ ఫ్లాట్ ఫారం జనంతో కల కల లాడుతోంది. రాత్రి రెండుగంటల సమయం. జనతా రావటానికి టైమయి గంటయింది. గంట లేటవడం చేత ప్రయాణీకులంతా కాచుకొని కూర్చున్నారు బండికోసం. సిమ్మెంటు సోఫాలపై నిదురించేవారు నిదురిస్తున్నారు. కొందరు కూర్చొనే కునుకుపాట్లు పడుతున్నారు. మరికొందరు రైలువచ్చే దిశకు ఆశగా చూస్తున్నారు. ఫ్లాట్ ఫారం లైట్ల కాంతిలో పట్టపగలులా వుంది. సోడాలని కేక వేసే కుర్రాళ్ళ అరుపులతో, పిప్పరమెంట్ల బండి గంట గణగణలతో, చూడ్ పేడా! అని అరచే అరపులతో, సోడా కియ్యమనే చప్పుడు, గూడ్సు వెళ్ళేటప్పుడు కూసే కూతలతో, చక్రాల చప్పుడుతో ఫ్లాట్ ఫారం అదరిపోతోంది. సిగ్నల్ యిచ్చాడు. పచ్చబల్బు వెలిగింది. స్టేషనులో గంట గణగణ లాడింది. నిద్రలో జోగుతున్న ప్రయాణీకులు త్రుళ్ళిపడిలేచి సామాన్లు సర్దుకుంటున్నారు. దూరంగా కూత వినబడింది. పెద్దదీపం వెలుగుతూ ముందుకు రాసాగింది రైలు, ప్రయాణీకులు లేచి అటూ యిటూ పరుగెత్తుతున్నారు. స్టేషన్ ముందు హారను వాయించుకుంటూ వచ్చి ఆగిందొక నల్లని ప్లిమత్ కారు. అందులో నుండి ఫుల్ సూట్ లో ముందుగా దిగాడొక తెల్ల వ్యక్తి, అతని శరీరానికి నల్ల సూటు ఎంతో నిండుగా వుంది. ఆరడుగుల ఎత్తు, ఎత్తుకు తగ్గలావు, విశాలమైన ఛాతీ నల్లగా ఒత్తుగానున్న కనుబొమ్మలు, ఛాతీపై పడిన చిన్నరింగు అతని అందాన్ని రెట్టింపు చేస్తోంది. విశాలమైన కళ్లు, మెరుస్తున్న కనుపాపలు, చక్కటిముక్కు, సన్ననిమీసం, చిరునవ్వు చిందించే పెదవులు, తెల్లని శరీరచ్ఛాయ, మెళ్లో టై, కోటుకి అందంగా తగిలించిన ఎర్రగులాబీ, ఎడమ చేతికి రేడియం డైల్ చీకట్లో సైతం మెరుస్తోంది. చేతిలో రుమాలు పువ్వులా వుంది. అతడు తొడిగిన అంబాసిడటర్ బూటు నల్లగా లైటు కాంతిలో మెరుస్తోంది.

వెల్ సీటు కారు తలుపుతీసి అయిదడుగుల వ్యక్తి ఒకడు దిగాడు. గళ్ళస్లాకుపై తెల్ల ఫాంటు. చామన చాయశరీరం. కాళ్ళకు కాబూలీ శాండిల్స్. కళ్ళకు వైట్ స్పెట్సు. చేతికి వాచీ. చాలా సింపిల్ గా వున్నాడు.

దూరంగా ట్రెయిన్ అరచింది.

'డ్రైవర్! సూట్ కేస్ తీసుకురా!' – అని ఆజ్ఞాపించి.

'చూశావా శేఖర్! సరిగ్గా టైముకి వచ్చాం. పద'– అంటూ ఫ్లారం మీదకు నడిచాడు. వారి వెనకే డ్రైవర్ లెదర్ కేసు తీసుకొని వెంబడించాడు.

ఫ్లాట్ ఫారం పైకి చేరుకొని 'డ్రైవర్! వాల్తేరుకి ఫస్ట్ క్లాస్ టిక్కెట్టు తీసుకురా'–అంటూ వందరూపాయల కాగితం అందించాడు. ఆ సొమ్ము తీసుకొని బుకింగ్ ఆఫీసుకు వెళ్ళాడు డ్రైవరు

డసెల్ భయంకరంగా గర్జిస్తూ వచ్చి నిండుచూలాల్లా మెల్లగా ఆగింది ఫ్లాట్ ఫారంపై, ఎక్కే జనం దిగేజనంతో ఫ్లాట్ ఫారం అంతా కోలాహలంగా తయారయింది.

రాజా, శేఖర్ లు బయలుదేరి ఫస్ట్ క్లాస్ కంపార్టుమెంటువద్దకు చేరారు. లెదర్ కేస్ తో కంపార్టుమెంటు ఎక్కి, దాన్ని బెర్త్ పై పడేసి, తలుపువద్దకు వచ్చి నిలుచున్నాడు.

'ఏం బ్రదర్! చేరగానే లెటర్ వ్రాస్తావు కదూ?' అన్నాడు శేఖర్.

'ఎంతమాటన్నావ్ బ్రదర్! రాయకుండా వుండగలనా? మన ఇద్దరి దేహాలు వేరుగాని మనసులు ఒకటని తెలియదా శేఖర్' బాధగా అన్నాడు రాజా.

'క్షమించు రాజా! నీ మనసుకు బాధకలిగించాను. క్షంతవ్యుడను'.

'ఛ ఛ! మనలో మనకేంటి క్షమాపణలు?'

ఏమో! వదినగారిని దర్శించిన సంతోషంలో పడి మరచి పోతావేమో నని'

'లేదు బ్రదర్! అక్కడకు చేరగానే అన్ని విష యాలు నీకు ఎక్స్‌ప్రెస్ కవరులో వివరంగా వ్రాస్తా! నామాట నమ్ము' అన్నాడు జేబునుండి సిగరెట్ తీసి పెదవుల కందిస్తూ.

'సార్!' అంటూ వాల్తేరుకు టిక్కెట్, తక్కిన చిల్లర అందించాడు డ్రైవర్.

అది అందుకొని పర్సులో వుంచి సిగరెట్ పొగ విడుస్తూ, 'డ్రైవర్! శేఖర్ని జాగ్రత్తగా తీసుకెళ్ళు, తెలిసిందా?' అన్నాడు డ్రైవరుతో రాజా.

'యస్సార్'–అంటూ శాల్యూట్ చేశాడు డ్రైవరు.

డీసెల్ అరచింది బయలుదేరుతున్నట్లుగా.

'బ్రదర్ క్షేమంగా వెళ్ళి లాభంగా రా!' అన్నాడు శేఖర్.

'నీవు వచ్చేముందు ఏ ట్రెయిన్‌కి వచ్చేది టెలిగ్రాం ఇయ్యి బ్రదర్! స్టేషనుకి వస్తా!' అన్నాడు.

'అలాగే శేఖర్ తప్పకుండా!' అంటూ మరోదమ్ము సిగరెట్ పీల్చాడు రాజా.

ట్రెయిన్ మెల్లగా కదిలింది. దానితోపాటు నడుస్తూ 'జాగ్రత్త బ్రదర్! రోజులు మంచివి కావు. చేరగానే లెటర్ వ్రాయి. నా మనస్సు కుదుట పడుతుంది.' అన్నాడు ట్రెయిన్‌తోపాటు తనూ పరుగెత్తుతూ శేఖర్.

'అలాగే బ్రదర్! ట్రెయిన్ వేగం హెచ్చుతున్నట్లుంది. నువ్విక ఉండిపో' అన్నాడు రాజా.

'విష్ యు గుడ్‌లక్!' అంటూ ట్రెయిన్‌ని వదిలేసి ప్లాట్‌ఫారంపై నిలబడి పోయాడు చెయ్యివూపుతూ శేఖర్.

రాజా కూడా ట్రెయిన్‌లో నుండి చెయ్యి వూపసాగాడు. ట్రెయిన్ వేగం హెచ్చించి, ప్లాటుఫారం విడిచి ముందుకు సాగిపోయింది. ట్రెయిన్ వెళ్లిపోయే వరకు ప్లాట్‌ఫారంపైనే నిలబడి, వెనుదిరిగాడు శేఖర్. కారెక్కి తలుపు మూసాడు. డ్రైవర్ హెడ్ లైట్సు వేసిన కారును ముందుకు నడిపించాడు.

ట్రెయిన్‌లో రాజా బెర్త్‌పై కూర్చొని, మరో సిగరెట్ వెలిగించి, వాచీ చూసుకున్నాడు. రెండుం పావు అయింది.

* * *

రాజా శేఖర్‌లు ప్రాణస్నేహితులు. ఎస్.ఎస్.ఎల్.సి వరకు కలిసి చదువుకున్నారు. ఒకరికోసం ఒకరు ప్రాణాన్నయినా యివ్వగలరు. ఒక్క నిముషమైనా విడిచి వుండలేరు. తనకి ఏ సలహా కావలసివచ్చినా శేఖర్‌ని అడిగి అతను చెప్పినట్లే చేస్తాడు రాజా, ఇద్దరూ ఫస్టు మార్కులతోనే ప్యాసయ్యారు. కానీ రాజా డబ్బున్నవాడగుటచే పి. యు. సి. లో చేరాడు. శేఖర్ మధ్యం కుటుంబీకుడు. ఫస్టుమార్కులతో ప్యాసయినప్పటికి డబ్బులేక పై చదువుకి విరమించుకున్నాడు. ఆ సంవత్సరనిలోనే శేఖర్ తండ్రి హఠాత్తుగా గుండె ఆగి చనిపోయాడు. ఆ బాధలో మునిగి సరిగా మూణ్ణెల్ల వర్య





పంపులు

మరియు

మోటారులు

'ఎన్. ఎం. ఐ.' పంపులు, మోటారులు అమర్చి మీ పంటలద్వారా అధిక లాభము పొందండి. కొన్ని సంవత్సరాల పరిశోధనా ఫలితమే యీ పరికరములు.

తయారించువారు

నిర్మలా ఇండస్ట్రీస్ : : కోయంబత్తూరు-2

ఆ విచారంలో నుండి తేరుకోలేక పోయాడు. ఆ సమయంలో రాజా ఎంతో ప్రయత్నించాడు శేఖర్‌ని విచారసాగరంలో నుండి తప్పించాలని. కాస్తో కూస్తో విజయం సాధించాడు కూడా. ఎన్నో విధాల శేఖర్ని పి. యు. సి. లో చేరమని చెప్పాడు. డబ్బు తను యిస్తానన్నాడు. కాని లాభం లేకపోయింది. శేఖర్ ఆత్మాభిమానంగల మనిషి, పై వారైతేనేం, తన వారైతేనేం అప్పటికైనా కానీ అడుగడు. పోనీ వూరికే యిచ్చినా పుచ్చుకోడు ఎంతసేపూ తను స్వంతగా కష్టించి సంపాదించిన డబ్బే తనకు ప్రధానం, సంతృప్తి, ఆనందం కలిగిస్తుందని వాదిస్తాడు. అందులోనే ఎక్కువ సౌఖ్యం వుంటుదని అంటాడు. కానీ ఒకరి దగ్గర పుచ్చుకోవటానికి మాత్రం వప్పుకోడు. తన స్నేహితులకు ప్రాణం పెట్టగల మనిషి. తనని నమ్ముకున్న వారెవర్నీ మోసం చెయ్యడు, తన కింత లేక పోయినప్పటికి మరొకరు అడిగితే చేతనైన సహాయమేదో చేస్తాడే తప్ప లేదనడు. ఎప్పుడూ మనిషి నిండుగా నవ్వుతుంటాడు. రాజాతో గలగలా మాట్లాడుతుంటాడు. శేఖరికి ప్రాణస్నేహితుడు రాజా ఒక్కడే. ఎంతోమంది స్నేహితులు వున్నప్పటికి రాజా అంత ఆత్మీయులు కాలేక పోయారు, అందుకు కారణం ఫ్రెండ్సులో ఏదో లోపం కనిపించటమే. రాజాలో మాత్రం ఎంత వెతికి చూచినా ఒక్క లోపం కనిపించదు. సరికదా దాన్ని నిరూపించటం మన శక్యం కాదు.

రాజా హుందాతనం ఠీవితో మనిషి నిండుగా వుంటాడు. ఎంతసేపూ-తన తండ్రి జమిందారు, పైవారు తనకంటె చిన్న, డబ్బులేదు అని వాళ్ళని హీనపరచటం, చిన్న చూపు చూడటం అతనిలో లేవు. ఎల్లప్పుడు బీద వారికి లేదనకుండా చేతనయినంత సహాయం చేస్తాడు. తండ్రితో కూడ చెప్పి చేయిస్తాడు. తల్లి దండ్రులను పూజిస్తాడు. తెల్లవారగానే మాతాపితల పాదాలకు భక్తిగా నమస్కరిస్తాడు. ఎప్పుడూ పెద్దవారి మాట తిరస్కరించడు. కొందరు జమిందారుల పిల్లలున్నారంటే చదువుండదు. దానితోపాటు గుణాలు కూడా మంచివిగా వుండవు. ఎప్పుడూ ఎవర్నో ఒకర్ని నిందిస్తుంటారు. నిర్మలంగా వుండి తమ ఆజ్ఞలను నెరవేరుస్తున్న పుత్రరత్నాన్ని చూచి కొందరు మురిసి పోతుంటారు. పుత్రునికేమైనా కోరికటంటే అవి తప్పక తీరుస్తారు.

రాజా విశాఖపట్నంలో ఒక అమ్మాయిని ప్రేమించి ఆమెనే తప్ప మరొకర్ని వివాహం చేసుకోనంటే, ఆమె సుగుణ సంపన్నయని, అందాల రాసియని తెలుసుకొని అతని తల్లి దండ్రులు పొంగిపోయేరు. నాగమణి ఫోటో చూచి, తమ కోడలు ఇంత అందంగా వున్నందుకు, కొడుకు కోడలు చిలకా గోరింకల్లా వున్నందుకు ఎంతో మురిసిపోయారు. పుత్రుని కోర్కె తీర్చాలని నిశ్చయించుకున్నారు. పుత్రుని మనసు సరిగా వుండకపోవటం తెలుసుకొని నాలుగురోజులు గడిపి రమ్మని విశాఖపట్నం పంపించారు. ప్రాణస్నేహితుడైన శేఖర్ పాలసీ అంతా రాజాకు నచ్చింది. అంతవరకు తనతో సంచరిస్తున్న ఫ్రెండ్సులా కాక వ్యతిరేకంగా వుండటం రాజానెంతో ఆకర్షించింది. ఫ్రెండ్సు అంతా తన చుట్టూ చేరి డబ్బు ఖర్చుపెట్టించేవారే. శేఖర్ అలాకాక, తనకు ఎన్నో నీతులు చెపుతాడు. ఫ్రెండ్సుని ఎక్కువగా పరిచయం చేసుకోవద్దంటాడు. అదృష్టం కొద్దీ మంచివారే వుండొచ్చు, చెడ్డవారే వుండొచ్చు, ఒకే ఒకర్ని నమ్ముకోమని, ఎన్ను మని చెపుతాడు. ఏదైనా సూటిగా చెప్పే మనిషి శేఖర్, అందుకే రాజాకు బాగా నచ్చాడు.

రాజా తల్లిదండ్రులు రామచంద్రరావు, సీతా మహాలక్ష్మమ్మగారలు. వారు పేర్లకు తగ్గట్టుగానే ప్రవర్తించేవారు. ఎవలోరినైనా ఏదైనా లోపం కనబడితే దాన్ని సరిదిద్దటానికి ప్రయత్నించేవారు. దానధర్మాలు చేసేవారు. ఒకరికి బాధకలిగించేలా మాట్లాడేవారు కాదు. ఇతరుల కష్టాలు తమ కష్టాలుగానే భావించుకునేవారు. వారికి ఒక్కడే పుత్రుడు రాజా.

రామచంద్రరావుగారు జమిందారు. తాతముత్తాతల నాటి ఆస్తిపడుంది, కూర్చొని తిన్నా తరగనిది. అంత ఆస్తిగడించి పెట్టారు వారి పూర్వీకులు. ఆ ఆస్థినే మంచి కార్యాలకు వినియోగం చేస్తున్నారా దంపతులు. రాజా సిగరెట్ పొగ రింగ్ రింగులుగా వదుల్తుంటే నాగమణికి తనకు జరిగిన పరిచయం, దాని ఫలితం అతని కనులముందు లీలగా చిత్రాలు కనిపించ సాగాయి.

♦ ♦ ♦ ♦

ఆ రోజు ఆదివారం. ప్రతివారికీ హాలీడే అండ్ జాలితే, వారానికి ఆ ఒక్కరోజు ఎవ్వరికీ పనుండదు.

(తరువాయి 19వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)

హాయిగా స్వేచ్ఛావాయువులు పీలుస్తారు. ఎంతోమంది ప్రోగ్రాంలు వేసుకొని జయప్రదం గావించుకుంటారు. మామూలు రోజులకంటే ఆ రోజు విశాఖపట్నం బీచి ఎక్కువ జనంతో కలకలలాడుతోంది. వివిధరకాలైన మనుష్యులతో, వారు ధరించిన వస్త్రాలతో, వారు మాట్లాడే మాటలతో, పకపకలతో, సముద్రఘోషతో, తినుబండారములు అమ్మేవారి కేకలతో కలకల లాడుతోంది. గుంపులు గుంపులుగా ఇసుకతిన్నెలపై కూర్చొని, కబుర్లు చెప్పుకుంటూ, అందులో వచ్చే విట్సుకు నవ్వుకుంటున్నారు, దూరంగా ఏకాంతంగా కూర్చొని ప్రకృతి సౌందర్యాన్ని తిలకించే రసికులతో. అక్కడి వాతావరణాన్ని లోతుగా పరిశీలించి రాసే రచయితలతో, ప్రకృతి సౌందర్యాన్ని తమ కుంచెలతో మనోహరంగా చిత్రించే చిత్రకారులతో, ఆ వాతావరణానికి పరవశించి, సంగీతాన్ని అప్రయత్నంగా ఆలాపించే గాయకులతో, అమ్మాయిల్ని ఏడ్పించడానికి వచ్చే స్టూడెంట్సుతో, సమయంకోసం వేచియుండి, తమ పనిని నిర్విఘ్నంగా సాగించుకొనేందుకు గుంపులో ప్రవేశించే చేబుదొంగలతో, కొందరి పురుషులను వశపరచుకోవటాని వచ్చే కొందరి స్త్రీలతో; జమిందార్లు, పేదవారు, మధ్యకుటుంబీకులు, చిన్న పెద్ద తారతమ్యం లేకుండా వేంచేసే ఆబాలగోపాలంతో బీచ్ కోలాహలంగా వుంది. ఆకాశంలో చిన్న మేఘమాలికలు తిరుగుతున్నాయి.

సాయంత్రం సముద్రంపై నుండి వచ్చే చల్లనిగాలులు శరీరాలకు తాకి గిలిగింతలు పెడుతున్నాయి. సముద్రుడు గర్జిస్తున్నాడు. కెరటాలు శరవేగంతో దూసుకు వచ్చి ఒడ్డును తాకుతున్నాయి. చిన్న అలలు సరదాగా ఆడుకుంటున్నాయి. పెద్ద కెరటాలు వాటి పాలిట యమదూతల్లా వచ్చి వాటిని చెల్లా చెదురు చేసి వేస్తున్నాయి. హోరుమనే సముద్ర గర్జన, రవి అస్తమిస్తున్నాడు తన పని ఈ రోజుకి అయి పోయినట్లు. తూర్పున చంద్రుడు ఉదయించటానికి సిద్ధంగా వున్నాడు. సముద్రంపై చేపలుపట్టే పడవలు, ప్రయాణం సాగించే పడవలు వున్నాయి. దూరంగా మూడు స్టీమర్లు ప్రయాణం చేస్తున్నాయి. వాటి గొట్టాల్లో నుండివచ్చే పొగ నల్లగా నింగికెగుస్తోంది. (సశేషం)



శ్రీ పద్మనాభం, శ్రీ రాజుబాబు జపాన్ దేశంలో తిరుగుతున్నప్పుడు తీసిన ఫోటో.